# విశాలాక్షమ్మ పిన్ని

## "శ్రీ మా న్"

"పిన్నమ్మగారిని సాగనంపడానికి సకాలంలోనే వచ్చావులే బావా!" అంది, చేమంతి పూలజడ బుజంమీదుగా ముందుకి జారవిడిచి, గుమ్మంలో ఒయ్యారంగా నుంచున్న గౌరి, ముసిముసి నవ్వులు నవ్వుతూ, వంగి కాళ్లు కడుక్కుంటున్న సీతాపతి తలెత్తి మరదలి వంక చూసిన చూపులో వెయ్యి ప్రశ్నలు తళుక్కున మెరిసినయి.

"అలా తెల్లబోయి చూస్తావేం బావా! మీపిన్నమ్మగారు క్రిందటు మీదట్టుగా ఉంది. ఇప్పుడో ఇం కాసేపటికో అనుకుంటున్నారు."—తన వాక్యాన్ని వ్యాఖ్యానించింది గౌరి, కళ్ళు చిత్రంగా తిప్పుతూ.

గౌరి అన్న మొదటి మాటవిని దేశాలమీద పోయిన విశాలాక్షమ్మ పిన్ని భర్త అచోకీ తెలిసింది కాబోలనీ భర్త దగ్గరికి వెళ్లడానికి ఆమె సన్నద్ధురాలు అవుతోంది కాబోలనీ సంతోష పడుతున్న సీతాపతిని గౌరి విడమర్చి చెప్పిన దారుణవార్త నిర్విణ్ణుణ్ణి చేసింది. వేరేమీ ప్రశ్నించకుండా కండువా మరదలి బుజాన వేసి, హోల్డాలూ, సూట్ కేసూ లోపల పెట్టించమని తలుపు చాటున నక్కి చూస్తున్న తన భార్యకు వినపడేటట్టు అని, గుమ్మంలో వాడు గుమ్మంలోనుంచే విశాలాక్షమ్మ పిన్ని ఇంటికి బయలు దేరాడు సీతాపతి.

* * *

రెండేళ్ళనాడు పెళ్లిఅయిన క్రొత్తల్లో మలుదోరణానికి ఆ ఊరు వెళ్ళినప్పుడు సీతాపతి మొదటిసారి విశాలాక్షమ్మగారిని చూశాడు. సాయంత్రం పూటరోడ్డు వేపు వంతెన దాకా షికారుగా వెళ్లి వద్దామని బయలుదేరిన సీతాపతికి సందుమలుపులో సవాసేరు వంకాయలు అస్తారుపదంగా పట్టుకుని వస్తున్న విశాలాక్షమ్మగారు ఎదురైంది. "ఏం నాయనా! సీతారామయ్యగారి ఈశ్వరి పెనిమిటివి కాదూ నువ్వు? ఎప్పుడొచ్చావు? నాలుగు రోజులుంటావా?"—అంటూ ఆమె పలుకరించింది, ముభావంగా సిగ్గుగా—"లేదండి ఎల్లుండి ఉదయం వెళ్లిపోవాలి. సెలవులేదు" అని అతడు బదులు చెప్పాడు "అయితే మన ఇంటికోకసారి రాకుండానే వెళ్ళిపోతావురా నాన్నా! అన్నదామె. ఎలా ఆమెనువదుల్చుకుందామా అని చూస్తున్న సీతాపతి అలాగే వస్తాను. లెమ్మనట్టు తలఊపి ముందుకువడిచాడు. "రేపుఉదయం తప్పకరావాలి సుమా!" అని మళ్ళీ ఒకసారి హెచ్చరించి, పమిటి చెంగులో వంకాయలతో, గజ్జెలకడియాలు ఘల్లుఘలున మ్రోయించుకుంటూ ఆమె తనఇంటి వేపు నడిచిపోయింది.

విశాలాక్షమ్మగారి వేషభాషలు సీతాపతికి విచిత్రంగా కనిపించినయి. వయస్సు మళ్ళి, పప్పూ పులగంలాగ నెరిసిపోయిన జుట్టు నున్నగా దువ్వకుని, నూదులచుట్ట చుట్టుకుని, చేమంతిపువ్వులు తురుముకుంది. గోచీపోసి చీరకట్టి, కాళ్ళకు అకుజోడూ, ముఖాన అర్ధణాకాసంత కుంకుమబొట్టూ, కళ్ళజోడూ ధరించింది. 'ఎవరా ఈ విచిత్ర వ్యక్తి!' అనుకుంటూ సీతాపతి ముందుకు సాగాడు.

ఆరాత్రి భార్యతో ఏకాంతంలో అతడు ఆమెప్రస్తావన తేగా, విలాసంగా భర్త చెక్కులు నిమురుతూ, మధ్యమధ్య కిలకిల నవ్వుతూ ఈశ్వరిఆమెనిగురించిన చరిత్రంతా చెప్పింది.

పాతికేళ్ళనాడు ఆమెభర్త దేశాలమీద లేచిపోయాడు. వేరే 'నా' అనే వాళ్ళెవ్వరూ లేరామెకు. విసిరి వేసినట్టు ఊరికి ఒకకొసను ఉన్న తన కొంపలో ఒక్కరీ కాలక్షేపం చేస్తూంది. గంపగయ్యాళి అవడంవల్ల ఆ అమ్మ తల్లి నోటికి ఊళ్లోఅంతా జడుస్తారు. పిల్లికూనల్ని పెంచడం ఆమెకుసరదా. తను పెంచే పిల్లికూనతప్ప ఊళ్లో మరొకఇష మైన ప్రాణిఅంటూ ఆమెకులేదు. భర్త వదలిపోయిన నాలుగెకరాల పంటమీద వచ్చే కటుబడి గింజలతో ఒకళ్ళ జోలీ, సొంఠీ లేకుండా రోజులు గడుపుకుంటూ వస్తూంది.

* * *

మర్నాడు ఉదయం విశాలాక్షమ్మగారు చేతిలో పిల్లికూనతోసహా ప్రత్యక్షమై, సీతాపతిని తమఇంటికి రమ్మనికూచుంది. అతని అత్తగారు చెరుకు చెరుగ్గానే—"మంగలాడు వచ్చేవేళ అయిందమ్మా...తలంటి పోస[...] వాలి..." అని నసిగింది. కాని "నే[...] కొరుక్కుతినను లేవే తల్లీ నీ అల్లుణ్ణి! [...] ఇప్పుడే వచ్చేస్తాడులే!" అంటూ అవిస[...] కట్టించి, సీతాపతి వేపు తిరిగి, "[...] నాన్నా! పోదాం" అంది విశాలాక్ష[...] గారు. పిల్లికూనలాగ సీతాపతి ఆమె[...] వెళ్ళాడు.

పెళ్ల వేయడంలాంటి సంస్కారాలు[...] కళాకాంతులుడిగి, బావురుమంటూ [...] తమ ఇంటివసారాలో ఒక నులక మ[...] వాల్చి అతన్ని కూచోబెట్టింది విశాలాక్ష[...] గారు. జీడిపప్పు, ఎండుద్రాక్షపళ్ళు, [...] బెల్లం ముక్కలు ఒకఅల్యూమినియం[...] తెచ్చి ముందుపెట్టి తినమంది. "ఇప్పు[...] అత్తగారింట్లో ఉప్మా, కాఫీ పుచ్చు[...] వచ్చాను. ఇప్పుడివేమీ వద్దం[...] అంటున్నా వినిపించుకోకుండా ఎ[...] కాచి, చక్కెర వేసిన పాలుకూడా ఒక కంచు గ్లాసుతో తెచ్చి అక్కడ[...] 'పుచ్చుకో' మంది. అయిష్టంగానే సీ[...] ఆప్లేటూ, గ్లాసూ ఖాళీ చేశాడు.

ఫలాహారానంతరం ఆమె అతనికి ఇల్లంతా చూపించింది. దొడ్లో తుల[...] ప్రక్కగా బొమ్మరిళ్లు లాంటివి [...] మట్టితోకట్టిన చిన్నచిన్న కట్టడాలు [...] పతికి కనిపించినాయి. చిన్నపిల్ల లె[...] లేని ఈఇంట్లో ఈబొమ్మరిళ్లెవరు క[...] అని అతడు ఆశ్చర్యపోతూ ఉండ[...] ఆమె వాటివిషయం వివరించడంతో సంశయ నివృత్తి అయింది. ఆమె న[...] పరచి పరలోకాలకు పోయిన మూ[...] కూనల తాలూకు పూజా మందిరాలు[...] ఆపిల్లి కూనల ప్రస్తావన రాగానే [...] అమితమైన దుఃఖంవచ్చి నోటమాటర[...] కళ్లజోడు తీసి, కళ్లు తుడుచుకు[...] కొంతసేపటికి దుఃఖాన్ని సంబాళిం[...] ఆపిల్లికూనల ఆటపాటలూ, ముద్దు[...] టలూ-అన్నీ వన్నెచిన్నెలుగా ఆ[...] పతికి వర్ణించి చెప్పింది. మొదటి పి[...] 'రాముడూ!' అని పిలుచుకునేది. రెండేళ్లలోనే నూరేళ్లూ నిండించుక[...] పోయింది. రాముడిపేరు అచ్చిరాలే[...]

(34-వ పేజీ చూడం[...]

# ★ విశాలాక్షమ్మ పిన్ని ★

(27 వ పేజీ తరువాయి)

వాళ తాను పెంచినపిల్లి కూనకి 'కృష్ణుడు' అని పేరుపెట్టింది. ఏడాదైనా నిండక మునుపే దాని బ్రతుకూ తెల్లవారిపోయింది. చచ్చిపోయిన మూడు పిల్లికూనలలోకీ ఆ కృష్ణుడంటే ఆమెకు మరీ ప్రాణం. అంత చురుకైనదీ, ప్రేమ తెలిసిందీ ప్రపంచంలో మరో పిల్లికూన ఉండదని ఆమె నమ్మకం. మూడో పిల్లికూనకి-దేవుళ్ళ పేర్లు అచ్చి రావడంలేదని 'ఎల్లప్ప' అని పేరు పెట్టుకుంది. మూడేళ్లు కాబోలు బ్రదికి తినను అన్యాయంచేసి అది కళ్ళు మూసుకుంది. ఇప్పుడు పెంచుతున్న పిల్లికూనపేరు టిస్ టిస్!

మొదట ఒక అరగంటసేపు సీతాపతికి అక్కడ బెరుకు బెరుగ్గా అనిపించింది. తరువాత-విశాలాక్షమ్మగారి ప్రసంగ నైపుణి, మనో మార్దవం, ముఖ్యంగా తనపట్ల ఆమె చూపుతూన్న అవ్యాజ వాత్సల్యం అతనిని పూరిగా వశం చేసుకున్నాయి 'అండీ!' అని తనను మన్నించవక్కరలేదనీ, ఆప్యాయంగా నోరార 'పిన్నీ' అని పిలువవలసిందనీ ఆమెచేసిన ఆదేశాన్ని అతడు సులువుగానే పాలించగలిగాడు.

మరదలు గారి మూడు పార్లువచ్చి పిలిచి వెళ్ళిన తరువాత రెండు జాములికి ఆ రోజున సీతాపతి ఆ త్తవారింటికి తిరిగి వెళ్ళాడు.

ఆ మర్నాడు విశాలాక్షమ్మపిన్ని అతన్ని భోజనానికి పిలిచింది. ఆనాడు సీతాపతి ఆమె ఇంట్లో మరింత చనువుగా మెలిగాడు. ఆరోజంతా అక్కడే గడిపాడు. కొంతసేపు ఆమె అతనిచేత భాగవతం చదివించింది. మరికొంతసేపు తాను అధ్యాత్మ రామాయణ కీర్తనలూ, తరంగాలూ పాడి వినిపించింది. రాత్రి కూడా అక్కడే భోంచేసి, అత్తవారింటికి తిరిగి వస్తూ—అంత సరళ హృదయ అంత మాటకారి ఊరందరికీ గయ్యాళి గంపగా ఎందుకు కన్పిస్తున్నదా అనీ, అంతి ఉత్తమురాలిని భర్త ఎందుకు వదలిపెట్టాడా అనీ సీతాపతి ఆశ్చర్యపోయాడు.

* * *

మనస్సులో ఆందోళనతో, మాటి మాటికీ ముఖంమీద పడుతున్న క్రాపింగుతో, ప్రయాణంలో మాసిపోయిన దుస్తులతో పిచ్చివాడిలాగ సీతాపతి ఆ ఉదయం విశాలాక్షమ్మ పిన్ని ఇంటివేపు నడచిపోతున్నాడు. అతని మనస్సు మనస్సులో లేదు. ముందు వెళ్ళి పిన్ని ఎదుటవాలాలి! ఆమెకు వైద్య సహాయం సరిగ్గా జరుగుతూందో లేదో! అవసరమైతే పట్నం వెళ్ళి పెద్ద డాక్టరును తీసుకొని వచ్చి అయినా సరే, పిన్ని ప్రాణం కాపాడి తీరాలి!

గడిచిన రెండేళ్ళలోను అయిదారు సార్లయినా ఏదో వంక పెట్టుకుని తానా ఊరు వచ్చాడు. అంతకు ముందు ఎన్ని పండుగలకు రమ్మని మామగారు ప్రాధేయపడినా, ఏదో వంక చెప్పి ఎగకొడుతూ వచ్చిన తాను విశాలాక్షమ్మ పిన్నితో పరిచయమైన తరువాత ఆ ఊరు ప్రయాణం అంటే అమితోత్సాహంతో బయలుదేరేవాడు. పేరుకు మామగారింట్లో అతిథిగాని, ప్రొద్దస్తమానం పిన్ని గారింట్లోనే కాలక్షేపం! సగంరోజులు తిండికూడా అక్కడే! ఆమె ప్రసంగాలు వింటూంటే రోజులు నిమిషాల్లాగ గడిచిపోయేవి!...చిన్నవాడే మాతృవియోగం కలిగిన తనకు ఆలోటును ఆమె భర్తీ చేసింది...

అమితాందోళనతో పిన్నమ్మ ఇంటికి నడిచిపోతున్న సీతాపతి. మనస్సులో తాను 'పిన్ని'తో గడిపిన రోజులన్నీ సినీమా చిత్రంలాగ పరుగులు పెడుతున్నాయి.

క్రితం సారి ఆ ఊరువచ్చి తిరిగివెళ్ళే రోజున తమ ఇంటి పెమెట్టుమీద నుంచుని, "మళ్లీ ఎప్పుడొస్తావో నాన్నా! ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఈ పిన్నిని మాత్రం మరచిపోకేం!" అన్న పిన్నమ్మ మాటలు జ్ఞాపకం వచ్చి అతని కళ్ళవెంట నీళ్ళు తిరిగినయి. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ తనని సాగనంపే పిన్ని ఆసారి ఎందుకో చిత్రంగా మాట్లాడింది. రానున్న ఆపదలు తమ నీడలను ముందుగానే ప్రసరింప జేస్తాయనే ఇంగ్లీషు సామెత నిజమే నేమో!

* * *

తనవశంలో లేకుండా గాలిదుమారంలాగ విజృంభించి మెదడునంతా అల్లకల్లోలం చేస్తున్న అనేక విధాల ఆలోచనలతో మాటి మాటికీ ముఖంమీద పడుతున్న జుట్టు పైకి ఎగదోసుకుంటూ, వడివడిగా నడిచి పోతున్న సీతాపతికి విశాలాక్షమ్మ పిన్ని ఇల్లు ఇంకో పది అడుగులు ఉండనగా అక్కడినుంచే వస్తూన్న మామగారు ఎదురయ్యాడు. "ఏమోయ్! ఎప్పుడు రావడం? అంతా ఖులాసానా?" అని పలకరించాడాయన. ఆ ప్రశ్న వినిపించుకోకుండా సీతాపతి "మా పిన్నికెలా ఉంది? మరేమీ ప్రమాదం లేదు గద" అని ఆదుర్దాగా ఎదురు ప్రశ్న వేశాడు. ఏమని చెప్పటానికీ నోరాడక ఆయన—" చూద్దుగాని రా! పాపం నీకోసం అదేపనిగా కలవరిస్తూంది" అన్నాడు.

మెట్లెక్కి వసారాలోకి వెళ్ళగానే టిస్ టిస్ అతన్ని గుర్తుపట్టి 'మ్యావ్' 'మావ్' అంటూ వచ్చి అతని పాదాలు నాకడం మొదలు పెట్టింది. దాన్ని చేతులోకి తీసుకుని మృదువుగా తల నిమురుతూ సీతాపతి మామగారితో సహా హాల్లోకి వెళ్లాడు.

హాల్లో గోడప్రక్కగా మంచంమీద మెడవరకు తెల్లటి దుప్పటి ముసుగులో, ముఖాన అర్ధణా కాసంత కుంకుమబొట్టుతో విశాలాక్షమ్మ పిన్ని పడుకుని ఉంది గురక పెడుతూంది. కళ్లు అర్ధనిమీలితాలుగా ఉన్నాయి బాహ్య చైతన్యం ఏమీ ఉన్నట్టు లేదు. సీతాపతి లోపలకు వెళ్ళగానే టిస్ టిస్ అతని చేతుల్లోనుంచి దూకి, వెళ్ళి విశాలాక్షమ్మగారి పొట్టమీద ఎక్కికూచొని 'మ్యావ్' 'మ్యావ్' అని హృదయవిదారకంగా అరవడం మొదలు పెట్టింది. ఆ స్థితిలో పిన్నిని చూడగానే సీతాపతి దుఃఖం కట్టలు త్రెంచుకుని పైకి వచ్చింది. 'పిన్నీ! 'పిన్నీ! అంటూ విశాలాక్షమ్మగారి మంచం మీద వాలి వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టాడు.

ఆగొంతు గుర్తుపట్టి విశాలాక్షమ్మగారు మెల్లగా కళ్లు తెరిచి, గొణుగుమాటలతో అంది "...వచ్చావా నాన్నా!...మీ బాబాయితోపాటు నువ్వూ నాకింక కనపడవనుకున్నా..."కప్పంమీద దుప్పటి ముసుగులో నుంచి చెయ్యి పైకితీసి, అంతకు ముందే తన ఆస్తి అంతా సీతాపతికి దఖలుపరుస్తూ వ్రాయించి ఉంచిన విల్లు అతనికందించింది. సీతాపతికిదేమీ అర్థంకాక, "ఏమిటిదంతా పిన్నీ!... నీకొచ్చిన భయమేమీ లేదు...రోగం తిరుగుముఖం పడుతుంది..." అన్నాడు గద్గద స్వరంతో. ఆమాటలకు విశాలాక్షమ్మగారి ముఖంమీద ఒక విచిత్రమైన నవ్వు రేఖా మాత్రంగా తోచింది."...వెర్రినాన్నా!... ఇంక నీకు 'పిన్ని' లేదు...మీ బాబాయి కనిపిస్తే మాత్రం మీ పిన్నిని గురించి చెబుతావు గదూ!...అన్నట్టు—ఈ టిస్ టిస్... వాక్యం పూర్తి చేయలేకపోయింది అంతలో ఆమె కళ్లల్లో చూపు మారిపోయింది. నలుగురూ చేరి భూశయనం చేస్తూ ఉండగానే హంస లేచిపోయింది.

గుండెల్లో బరువంతా తీరిపోయే దాకా చంటిపిల్లవాడులాగ సీతాపతి పిన్నమ్మ శవం మీద పడి ఏడిచాడు. బుజం తడుముతూ అతన్ని ఓదారుస్తూ ప్రక్కన కూచున్న అతని మామగారు వేదాంతిలాగ ఆకాశంలో ఎక్కడికో చూస్తూ గొణిగాడు: "అనుబంధాలు చిత్రంగా ఏర్పడుతూ ఉంటాయి!" అని.

★